ఆంధ్రజ్యోతి
**
ANDHRAJYOTHY



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.157	228	259
సూర్యాపేట	రూ.160	230	260
నల్లగొండ	రూ.160	230	260

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 20.0



సభలో మాట్లాడుతున్న గోవా రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్

దేశానికి మోదీయే గ్యారంటీ

- డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ వికసిస్తుంది
- అహంకారం, కుటుంబ పాలనతో బీఆర్‌ఎస్‌కు ప్రజల చరమగీతం
- గోవా రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్
- యాదాద్రి జిల్లా కేంద్రంలో విజయ సంకల్ప యాత్ర ప్రారంభం

భువనగిరి రూరల్, ఫిబ్రవరి 20: డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ వికసిస్తుందని.. దేశానికి ప్రధాని మోదీయే పెద్ద గ్యారంటీ అని గోవా రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను ప్రారంభించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ప్రపంచంలోనే 5వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 3వ స్థానానికి చేరుకునే విధంగా ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు చేపడుతూ సబ్‌కాసాత్, సబ్‌కా వికాస్ దిశగా ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దేశంలో 25కోట్ల పేదలను ఆర్థికంగా పరిపుష్టి చేసేందుకు, 50కోట్ల మందికి జన్‌ధన్ ఖాతాలను తెరిచారన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ల కాలంలో ప్రాజెక్ట్‌ల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి జేబులు నింపుకున్నాడన్నారు. అహంకారం, కుటుంబ పాలనను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజలు కసితో తీర్పు ఇచ్చారని, అయితే అమలుకు సాధ్యంకాని ఝూటా గ్యారంటీలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ ఆ హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందన్నారు. 5 శతాబ్దాల దేశ ప్రజలకు అయోధ్య రామ మందిర కలను సాకారం చేసిన ఘనత నరేంద్రమోదీదేనన్నారు. తెలంగాణలో మొత్తం 17ఎంపీ స్థానాల్లో బీజేపీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కళాకారుల ధూంధాం ఆటాపాటలు సభికులను ఆకట్టుకున్నాయి. సభకు అధ్యక్షతన వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ గోవా రాష్ట్ర సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, నాయకులు పోతంశెట్టి రవీందర్, దాసరి మల్లేశం, నర్ల నర్సింగ్‌రావు, పడాల శ్రీనివాస్, చందా మహేందర్, పడమటి జగన్మోహన్‌రెడ్డి, కర్నాటి ధనుంజయ్య, మాయ దశరథ, చింతల రాంచంద్రారెడ్డి,పాపారావు, ఉమాశంకర్, రత్నపురం బలరాం, ఊదరి సతీష్, బందారపు లింగస్వామి,నీలం రమేష్, పట్నం శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం గోవా సీఎం ప్రచార బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ బస్సు యాత్ర యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రానికి బయలుదేరి, రాత్రి గుట్టలో బస చేసింది.


బస్సు యాత్రను ప్రారంభిస్తున్న గోవా రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్

నేడు ఆలేరుకు యాత్ర

బస్సు యాత్ర బుధవారం ఆలేరు, ఆత్మకూరు(ఎం), మోత్కూరు మండలాల్లో కొనసాగనుంది. 22న రామన్నపేట, చౌటుప్పల్, నారాయణపూర్ మండలాల్లో యాత్ర కొనసాగి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోకి అడుగుపెడుతుంది.


భువనగిరి నుంచి బయలుదేరిన బస్సు యాత్ర

కేసీఆర్ పదేళ్లకే కనుమరుగయ్యాడు : మాజీ మంత్రి, బీజేపీ జాతీయ నేత ఈటెల



తెలంగాణ జాతిపిత అని విర్రవీగి అవకాశవాద రాజకీయాలు, ఇనుప కంచెలు ఏర్పాటు చేసుకొని రాచరిక పాలన కొనసాగించిన కేసీఆర్ పదేళ్లకే కనుమరుగయ్యారని, భవిష్యత్‌లో ఆ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందని మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఎద్దేవా చేశారు. కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీని పదేపదే ద్వేషించి మోదీ శకం ముగిసిందని ప్రగల్భాలు పలికిన కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేసీఆర్ తమ, తమ కుటుంబాల బాగు కోరుకుంటే మోదీ 140కోట్ల ప్రజల బాగు కోరుకున్నాడని, దేశంలో మొత్తం 400 ఎంపీ సీట్లు గెలవడం ఖాయమన్నారు. గల్ఫ్ దేశంలో కూడా హిందూ ఆలయాలను ప్రారంభించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తెలంగాణ ఉద్యమంలో భువనగిరి ప్రాంత ప్రజలు కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి శూన్యం : బూర నర్సయ్యగౌడ్



రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రాభివృద్ధి శూన్యమని మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బీజేపీకి ఓటేస్తే నిండు నీటి కుండలు, లంకె బిందెల్లా తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చెందిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఢిల్లీలోని కేంద్ర మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. రైతుబంధు, ఆరు గ్యారంటీలకు సంబంధించి సంక్షేమ పథకాలకు నిధులుల్లేక, రోజుకో అబద్ధాల కాలం వెళ్లదీస్తున్నారని ఆరు నెలల తర్వాత ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

బీజేపీతో పొత్తు అంటూ బీఆర్‌ఎస్ కొత్త డ్రామా: కాసం వెంకటేశ్వర్లు



పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉంటుందని మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి కొత్త డ్రామాకు తెరలేపాడని, బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీఆర్‌ఎస్ ప్రభుత్వం దోచుకున్న అవినీతి డబ్బులను కక్కిస్తామన్నారు. రాష్ట్రనేత డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే నరేంద్రమోదీ ప్రజాదరణ కలిగిన వ్యక్తిగా పేరొందారన్నారు. జిల్లాలో ఎయిమ్స్, ఎంఎంటీఎస్, కేంద్రీయ విద్యాలయం, తదితర పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలన్నారు.



తీగలాగితే.. డొంక కదులుతోంది

జిల్లా పశుసంవర్ధశాఖకు చెందిన అధికారి కొన్ని నెలల క్రితం ఓ ఫైల్ క్లియరెన్స్‌కు వెళ్లగా ఓ ఉన్నతాధికారి నేరుగా గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో అక్రమాల గురించి ప్రశ్నించడంతో ఖంగుతిన్నాడు. నిబంధనల మేరకు ఒక్కో గొర్రెల రైతుల నుంచి 10 నుంచి 12 యూనిట్ల గొర్రెలు మాత్రమే కొనుగోలు చేయాలి. ఒకరిద్దరు మధ్యవర్తుల నుంచి ఎందుకు పెద్ద మొత్తంలో యూనిట్లు కొనుగోలు చేశారని ప్రశ్నించడంతో సదరు అధికారి నీళ్లు నమిలినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నందున మరోమారు కలెక్టరేట్‌కు రావొద్దంటూ ఆ ఉన్నతాధికారి చెప్పడంతో పశుసంవర్ధకశాఖ అధికారి అటువైపు వెళ్లడమే బంద్ చేసినట్టు వినికిడి.

- నల్లగొండ

- ఏపీలోని అనంతపురం, ప్రకాశం జిల్లాల నుంచి అత్యధికంగా కొనుగోళ్లు
- గొర్రెల సేకరణలో మూడు శాఖల అధికారులు
- ఫైల్ క్లియరెన్స్ కోసం సంబంధిత శాఖ ముమ్మర యత్నాలు

పశుసంవర్ధక శాఖలో జరిగిన అక్రమాలు, అవినీతిపై తీగ లాగితే డొంక కదులుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు చెందిన ఓ దళారీ నుంచి జిల్లా అధికారులు పెద్ద మొత్తంలో గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసినట్టు తెలిసింది. గత కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ వద్దకు సదరు గొర్రెల యూనిట్ల కొనుగోలు బిల్లుల చెల్లింపు ఫైల్ వెళ్లగా, ఆయనకు అనుమానం రావడంతో దాన్ని పక్కన పెట్టారు. అయితే పశుసంవర్ధక శాఖలో ఓ అధికారితో పాటు కొందరు ఉద్యోగులు పదేపదే ఆ ఫైల్‌ను క్లియర్ చేయించుకోవడం కోసం ఉత్సాహం చూపించడంతో నాటి కలెక్టర్ ఒకానొక దశలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పూర్తి స్థాయిలో ఫైల్‌ను పరిశీలిస్తానని, తొందర పడవద్దని, అక్రమాలు జరిగినట్టు పరిశీలనలో తేలితే ఫైల్‌ను నిలిపి వేస్తానని ఆయన స్పష్టం చేసినట్టు సంబంధిత శాఖలో చర్చ నడుస్తోంది. అయితే కలెక్టర్ బదిలీ అయిన తరువాత కలెక్టర్ హరిచందన బాధ్యతలు స్వీకరించిన అనంతరం కూడా ఈ ఫైల్‌ను పరిశీలించాలని ఆమెను కోరగా, ఆమె సైతం గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో పొరపాట్లు ఉన్నట్టు గ్రహించి ఫైల్ క్లియరెన్స్‌కు తిరస్కరించినట్టు సమాచారం.

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయి నుంచి..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయిలో చక్రం తిప్పిన కొందరు జిల్లా స్థాయిలో అధికారులను గుప్పిట పెట్టుకొని గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడినట్టు సమాచారం. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఏసీబీ దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయానికి గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు చెందిన గొర్రెల రైతులను పిలిచి విచారించారు. వారు తమకు రావాల్సిన బిల్లుల గురించి ఏసీబీకి తెలియజేసినట్టు సమాచారం. కాగ్ నివేదికతో పాటు ఏసీబీ అధికారులు విచారణలో సేకరించిన సమాచారం మేరకు నల్లగొండ జిల్లాలో జరిగిన అక్రమాలపై విచారణను వేగవంతం చేసే అవకాశం ఉంది. 1,066 యూనిట్లకు సంబంధించి ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి దళారుల వద్ద పెద్ద మొత్తంలోఓ యూనిట్లు కొనుగోలు చేశారా? లేదా రైతుల నుంచి సేకరించారా అనేది తెలుసుకోనున్నారు. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన ఓ మధ్య దళారీ నుంచి 400యూనిట్ల గొర్రెలను కొనుగోలు చేశారన్నా ఆరోపణలు ఉన్నాయి. ఒక యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటుంది. అయితే అన్ని యూనిట్ల గొర్రెలు ఒకే రైతు వద్ద ఉండే ప్రసక్తి లేదు. కేవలం దళారుల నుంచే గొర్రెలు కొనుగోలు చేశారన్న అనుమానాలు బలపడుతున్నాయి.

ఐదుగురు దళారుల నుంచి 832 యూనిట్లు?

నల్లగొండ జిల్లా పశుసంవర్ధక అధికారులు సుమారు 1,066 యూనిట్ల గొర్రెలు కొనుగోలు చేశారు. అయితే ఐదుగురు దళారుల నుంచి 832 యూనిట్లు కొనుగోలు చేసినట్లు తెలిసింది. అనంతపురం, ప్రకాశం జిల్లాలతో పాటు ఏపీలోని మరో జిల్లా నుంచి వీటిని సేకరించారు. జీవో 52 ప్రకారం ఒక్కో రైతు నుంచి 10 నుంచి 12 యూనిట్లు మాత్రమే కొనుగోలు చేయాలి. కాని ఒక వ్యక్తి నుంచి 198యూనిట్లు, మరొకరి నుంచి 185 యూనిట్లు, ఇంకొకరి నుంచి 168యూనిట్లు సేకరించారు. అదేవిధంగా మరొకరి నుంచి 150యూనిట్లు, ఇంకొకరి నుంచి 131 యూనిట్లు సేకరించినట్లు తెలిసింది. ఈ ఐదుగురికే సుమారు రూ.12కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు జరిగినందున బిల్లులు చెల్లించడం కష్టతరమని తెలుస్తోంది. ఈ గొర్రెల కొనుగోలులో మూడు శాఖలకు చెందిన అధికారులు కీలకపాత్ర పోషించారు. అసలు కొనుగోళ్లు జరిగాయా? కొనుగోలు చేస్తే లబ్ధిదారులు ఎవరు? అనేది ఏసీబీ విచారణలో తేలే అవకాశం ఉంది.

ఆ బిల్లులు చెల్లిస్తే సమస్యే..

గొర్రెల యూనిట్లను అక్రమంగా సేకరించి దళారులకు ప్రయోజనం చేకూర్చినందున బిల్లుల చెల్లింపు ఫైల్ నిలిచింది. ఈ బిల్లులు చెల్లిస్తే పశుసంవర్ధకశాఖలో ఓ అధికారితో పాటు మరొకరు, ఇద్దరు ఉద్యోగులు కూడా చిక్కుల్లో పడతారని తెలుస్తోంది. బిల్లుల చెల్లింపు విషయంలో సమస్యలు వస్తాయని సీనియర్ అధికారులు సైతం గొర్రెల యూనిట్ల స్కీంకు, ఆ ఫైల్‌కు దూరంగా జరిగినట్టు సమాచారం. ఏ అధికారైతే యూనిట్లు కొనుగోలు చేశారో ఆయనే దీనికి బాధ్యత వహించాలని, తమకు తలనొప్పి ఎందుకని కొందరు అధికారులు భావించి పక్కకు తప్పుకుంటున్నట్టు వినికిడి. దళారులు బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్ర స్థాయిలోని ప్రజాప్రతినిధులతో పాటు ఓ అధికారి సైతం ఈ విషయంలో జోక్యం చేసుకుని బిల్లులు చెల్లించేలా చూడాలని జిల్లా స్థాయిలో ఓ అధికారికి ఆదేశా లు జారీ చేయడంతో, ఆయన అంగీకరించినప్పటికీ ప్రభుత్వం మారడం, ఇంతలో అక్రమాలు బయటకు రావడంతో కథ అడ్డం తిరిగింది. దీంతో ఈ అక్రమాల బాగోతం నుంచి ఎలా బయటపడాలనే ఆలోచనలో ఓ అధికారితో పాటు మరో ఇద్దరు ఉద్యోగులు ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ఓ సీనియర్ అధికారితో పాటు సెక్షన్ ఉద్యోగి సెలవుల్లో ఉన్న సమయంలో జిల్లాలో పనిచే స్తూ వివాదస్పద నిర్ణయాలు తీసుకున్న అధికారేఈ అక్రమ గొర్రెల యూనిట్ల కొనుగోళ్లలో ఉన్నట్లు సమాచారం.

కలెక్టర్ వద్ద ఫైల్ పరిశీలనలో ఉంది

గొర్రెల యూనిట్ల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపునకు సంబంధించిన ఫైల్ కలెక్టర్ వద్ద పరిశీలనలో ఉంది. నేను జిల్లా అధికారిగా కొత్తగా వచ్చినందున ఆ ఫైల్‌ను పూర్తిగా పరిశీలించలేదు. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన వ్యక్తి నుంచి పెద్ద మొత్తంలో యూనిట్లను కొనుగోలు చేశారనే విషయంలో నా వద్ద సమాచారం లేదు. ఏమైనా గతంలో పొరపాటు జరిగితే కలెక్టర్ పరిశీలనలో బయటపడుతుంది. యూనిట్ల కొనుగోలులో నా జోక్యం లేదు. గతంలో పనిచేసిన అధికారులే కొనుగోలు చేశారు. బిల్లుల చెల్లింపు యూనిట్ల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఉంటుంది.

- ఎంవీ.సుబ్బారావు, పశుసంవర్ధకశాఖ జేడీ

ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు

- విద్యార్థులు మనోధైర్యంతో ముందుకెళ్లాలి
- రెండు కుటుంబాలకు న్యాయం జరిగేలా కమిషన్ కృషి

ఇమాంపేట గురుకుల పాఠశాలను సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య


ఇమాంపేట పాఠశాలలో విద్యార్థులను విచారిస్తున్న కమిషన్ సభ్యులు

సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 20: ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఇమాంపేట గురుకుల పాఠశాల విద్యార్థినుల ఆత్మహత్యల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం ఆయన పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్‌లతో కలిసి తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతో పాటు షెడ్యూల్డు కులాల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రతను పెంపొందించుకుని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులకు సమస్యలుంటే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేసి నివృత్తి చేసుకోవాలన్నారు. భువనగిరి, సూర్యాపేటలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట గురుకుల విద్యార్థినుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం అందేలా కమిషన్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తుందని హామీ ఇచ్చారు. ముందుగా ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమై జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో తరగతి గదిలో సమావేశమై వైష్ణవి, అస్మితల సహచర స్నేహితులు, ఫేర్‌వెల్ వేడుక, తదుపరి సంఘటనల వివరాలను విడివిడిగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు పరీక్షల సమయంలో మనోధైర్యాన్ని కోల్పోకుండా ఉండాలని, స్నేహపూర్వక వాతావరణంలో పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. వైష్ణవి కుటుంబ సభ్యులను పరామర్శించి, అస్మిత కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. అదేవిధంగా కుల సంఘాల నాయకులతో కమిషన్ సభ్యులు భేటీ అయ్యారు. ముందుగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వసతి గృహంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులకు కలెక్టర్ ఎస్. వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వానికి అందజేసిన ప్రాథమిక నివేదికతో పాటు ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యుల వివరాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఆర్డీవో కృష్ణయ్య, డీటీడీవో శంకర్, వెల్ఫేర్ అధికారి లత, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మోతె, ఫిబ్రవరి 20: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే విద్యార్థినుల ఆత్మహత్యలపై కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్‌చేశారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సూర్యాపేట జిల్లా ఇమాంపేట గురుకుల విద్యార్థిని అస్మిత కుటుంబసభ్యులను మంగళవారం ఆమె పరామర్శించారు. మోతె మండలంలోని బుర్కచర్ల గ్రామానికి వెళ్లి అస్మిత తల్లితోపా టు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పేద విద్యార్థులు చదువుకునే గురుకులాల్లోనే ఈ ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వాటిని పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తిస్థాయిలో మంత్రి వర్గం ఏర్పాటుచేసి వాటిపై ప్రత్యేక చొరవచూపాలన్నారు. రెండు వారాల క్రితం భువనగిరిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకుంటే ఇంతవరకు విచారణ చేపట్టలేదన్నారు. అస్మిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ తోడుగా ఉంటుందన్నారు. ప్రభుత్వం వారి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయం అందజేసి అస్మిత చిత్రపటానికి నివాళి అర్పించారు. కవిత వస్తున్న విషయం తెలుసుకున్న మోతె మండలానికి చెందిన మహిళలు హుస్సేనబాద్ స్టేజీ వద్ద ఆపడంతో వారితో మాట్లాడారు. అక్కడే ఉన్న ఓ దివ్యాంగురాలితో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మాజీ ఎంపీపీ గుగులోత్ ఝాన్సీ, మండల అధ్యక్షుడు శీలం సైదులు, మద్ది మధుసూదన్‌రెడ్డి, వేణు, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.


అస్మిత కుటుంబసభ్యులను ఓదారుస్తున్న కవిత

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎస్పీ రాహుల్ హెగ్డే


మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటరూరల్, ఫిబ్రవరి 20: పెట్రోలియం, గ్యాస్ పైప్‌లైన్‌లో జరిగే ప్రమాదాలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కాసరబాద క్రాస్‌రోడ్డులో ప్రముఖ ఇంధన సంస్థలు హిందూస్థాన్ పెట్రోలియం, గెయిల్ ఇండియా, పీఐఎల్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ, రోడ్డు పనులు, బోర్‌వెల్స్, మట్టి తవ్వకాల సమయంలో ఇంధన పైప్‌లు లీక్ అవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై సంస్థలు పూర్తిగా నిఘా ఉంచాలన్నారు. పైప్‌లైన్ సమీప రైతులు, వ్యాపారులు భూముల్లో తవ్వకాలు జరిపేటప్పుడు, బోర్ డ్రిల్ వేసేటప్పుడు సంబంధిత సంస్థలకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, సంస్థల ప్రతినిధులు కిషోర్, దుర్గాప్రసాద్, యోగేష్, వెంగళరావు, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో ఏసీబీకి చిక్కిన

పంచాయతీరాజ్ ఏఈ

- రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- డీఈ కార్యాలయంలో ఘటన

•7లో..

రోడ్డు ప్రమాదంలో గరిడేపల్లి ఎస్ఐకి గాయాలు


- పెన్‌పహాడ్ మండలంలో అదుపుతప్పిన కారు

బాలరాముడి దర్శనం కోసం ప్రత్యేక రైలు

భువనగిరి రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించిన సంకినేని వెంకటేశ్వర్‌రావు


భువనగిరి రైల్వే స్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభిస్తున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

సూర్యాపేట సిటీ, ఫిబ్రవరి 20: అయోధ్య బాలరాముడి దర్శనంకోసం కేంద్రప్రభుత్వం భువనగిరి రైల్వేస్టేషన్‌నుంచి ప్రత్యేక రైలు సౌకర్యం కల్పిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం అయోధ్య రామమందిరం దర్శించుకోవడంకోసం సూర్యాపేట నుంచి భువనగిరి రైల్వేస్టేషన్ వరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును జిల్లాకేంద్రంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలనుంచి రామ భక్తులు అయోధ్యలో బాల రాముడి దర్శనంకోసం వెళుతుండడంతో రామ భక్తులకోసం భువనగిరి రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలును కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈరైలు ప్రయాణాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు భువనగిరి రైల్వేస్టేషన్‌లో అయోధ్య వెళ్లే రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. వీరు నాలుగు రోజుల్లో తిరిగిరానున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, నాయకులు గొలి మధుసూధన్‌రెడ్డి, చల్లా శ్రీలతరెడ్డి, కడియం రామచంద్రయ్య, కర్నాటి కిషన్, కాపా రవికుమార్, చెలమల్ల నరసింహ పాల్గొన్నారు.

పాతగుట్టలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- వేడుకగా బ్రహ్మోత్సవ సంబురం
- భేరీపూజ..దేవతాహ్వాన పర్వాలు
- 22 రోజుల్లో రూ.1.77కోట్ల హుండీ ఆదాయం



పాతగుట్టలో అలంకారసేవను, ధ్వజ పతాకాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు, పాల్గొన్న అధికారులు

యాదగిరిగుట్ట,ఫిబ్రవరి 20: యాదగిరిగుట్ట అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవ సంబరం నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం ధ్వజారోహణం, దేవతాహ్వానం,హోమ పూజలు, రుత్విక్‌బృందం వేద పఠనాలతో పాతగుట్ట ఆలయ సన్నిధి ఆధ్యాత్మికతను సంతరించుకుంది. ప్రధానాలయ మండపంలో గరుడాళ్వార్ల చిత్రపటం వద్ద పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, బంగారు, ముత్యాల ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. గరుత్మంతుడి పటాన్ని శ్వేత ధ్వజ పతాకంపై చిత్రించిన అర్చకస్వాములు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గరుడ పతాకాన్ని ధ్వజ స్తంభంపైకి ఆరోహణ చేశారు. ఇంద్ర, యమ, వరుణ, కుబేరాది గణాలను ఆవాహన చేసి గరుడ మూలమంత్రంతో గరుడ ప్రసాదానికి ప్రత్యేక పూజలు చేసి గరుత్మంతుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దలను ఎగురవేశారు. ప్రధానాలయంలోని యాగశాలలో మూల మంత్ర, మూర్తిమంత్ర పఠనాలతో హోమ పూజలు కొనసాగాయి.మహోత్సవ కైంకర్యాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు,అర్చకబృందం నిర్వహించగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బీ.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు,ఏఈవో గజ్వేల్ రమేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలకు అష్టదిక్పాలకులను ఆహ్వానించడానికి మంగళవారం రాత్రి భేరిపూజ, దేవతాహ్వాన పర్వాలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. ప్రధానాలయ మండపంలో జరిగిన ఈ విశేష వేడుకలో అష్టదిక్పాలకులకు ఆహ్వానం పలుకుతూ సప్త స్వరాలు,ఇష్టవాయిద్యాలను శ్రవణానందంగా వాయించారు.

నేటి నుంచి అలంకార సేవలు

స్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు నుంచి అలంకార సేవలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు, అర్చకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం ఉదయం సింహవాహన సేవ, రాత్రికి అశ్వవాహన సేవలో ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు.

లక్ష్మీనృసింహుడికి ఏకాదశి లక్షపుష్పార్చనలు


గుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని లక్షపుష్పార్చన, క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి స్వర్ణ సింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్వామి, అమ్మవార్ల సహస్రనామ పఠనాలతో అర్చకబృందం, వేదపండితులు వివిధ రకాల పుష్పాలతో లక్షపుష్పార్చనలు నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణం, కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద, శివాలయం, పాతగుట్ట ఆలయంలో కొలువైన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీదళార్చనలు నిర్వహించారు. శివాలయంలో నిరామలింగేశ్వర స్వామికి, స్ఫటికమూర్తులకు నిత్యార్చనలు, యాగశాలలో రుద్రహవన పూజలు కొనసాగాయి.



గరుడ ముద్దలను ఎగురవేస్తున్న అర్చకస్వాములు

22 రోజుల్లో రూ.1.77కోట్ల హుండీ ఆదాయం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఖజానాకు 22రోజుల్లో రూ.1.77కోట్ల ఆదాయం సమకూరింది. భక్తులు స్వామికి హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను మంగళవారం కొండకింద సత్యనారాయణస్వామి వ్రతమండపం రెండో హాల్‌లో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు పర్యవేక్షణలో సిబ్బంది నిర్వహించారు. గత నెల 29వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు యాదగిరిక్షేత్రాన్ని సందర్శించిన భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను సిబ్బంది లెక్కించారు. లక్ష్మీనృసింహుడికి 22రోజుల్లో రూ.1,77,99,734 కరెన్సీ, 99గ్రాముల మిశ్రమ బంగారం, 4.170కిలోల మిశ్రమ వెండి ఆలయ ఖజానాకు సమకూరినట్టు వారు తెలిపారు. విదేశీ కరెన్సీ రూపంలో 397 అమెరికా డాలర్లు, 70 ఆస్ట్రేలియా డాలర్లు, 20 కువైట్ దినార్లు, 5 ఇంగ్లాండ్ పౌండ్స్, 20 యూఏఈ దిర్హామ్స్, ఒకటి మలేషియా రింగెట్, 5 ఖతార్ రియాల్స్, 50 న్యూజిల్యాండ్ డాలర్లు, 10 నేపాల్ రూపీస్ ఆలయ ఖజానాలో జమ చేసినట్లు తెలిపారు.



రంగస్థల నటుడు లేఖానందస్వామి మృతి

- నల్లగొండ జిల్లాకేంద్రంలో కవులు, రచయితల కన్నీటి వీడ్కోలు



లేఖానందస్వామి(ఫైల్)

నల్లగొండ కల్చరల్, ఫిబ్రవరి 20: రంగస్థల నటుడు, కవి, రచయిత లింగబోయిన లేఖానందస్వామి(67) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో 1957లో జన్మించిన లేఖానందస్వామి తెలుగు, చరిత్ర, సామాజిక శాస్త్రాలతోపాటు ఎడ్యుకేషన్ ఇన్ మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 'భిక్షుకుంట్ల సామాజిక జీవనం' అనే అంశంపై ఎంఫిల్ పూర్తి చేశారు. పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక నాటకాల్లో సుమారు 50కిపైగా వివిధ పాత్రలు పోషించారు. 2006లో జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. రాఘవేంద్ర బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనకు సోమవారం రాత్రి గుండెపోటు రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. జిల్లా కేంద్రంలో లేఖానందస్వామి అంత్యక్రియలు జరిగాయి. లేఖానందస్వామికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అంత్యక్రియల్లో పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, బెల్లి యాదయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, ఎల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చెర్వుగట్టుపై ఘనంగా దోపోత్సవం



దోపోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న సిబ్బంది

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20 : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున దోపోత్సవం నిర్వహించారు. అశ్వవాహనంపై పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠింపజేసి, ఆలయవీధుల్లో కల్యాణమంటపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం సంప్రదాయాలను అనుసరిస్తూ దోపోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి విశేష ఉత్సవాల్లో ఒకటైన దోపోత్సవ విశిష్టతను, వృత్తాంతాన్ని ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ భక్తులకు వివరించారు. అనంతరం ఉదయం అష్టోత్తర శత కలశాలతో స్వామివారికి అర్చకులు శ్రీకాంత్‌శర్మ, సతీశ్ శర్మ, సురేశ్ శర్మ, నాగఫణిశర్మలు అభిషేకం సూర్యనమస్కారాలు, దీక్షా హోమాలు, బలిహరణ మహాపూర్ణాహుతి నిర్వహించారు. స్వామి వారి ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ఆరోహణం చేసిన ధ్వజాన్ని అవరోహణ చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య త్రిశూల స్నానం, వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఉత్సవ పూజాక్రతువుల్లో పాల్గొన్న వారికి పండిత సన్మానంచేశారు. రాత్రి పుష్పోత్సవం, ఏకాంత సేవలను నిర్వహించారు. వేడుకలో దేవస్థాన ఈవో సిరికొండ నవీన్‌కుమార్, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరెడ్డి, సిబ్బంది ఇంద్రసేనారెడ్డి, వల్లూరి శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వంశీ, రాజయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి బుజిలాపురంలో బ్రహ్మోత్సవాలు

మోత్కూరు, ఫిబ్రవరి 20: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామంలో ఈ నెల 22 నుంచి 25 వరకు శ్రీలక్ష్మీనర్సింహస్వామి, శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. బుజిలాపురం గుట్టపై వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి, గ్రామంలో వెలిసిన శ్రీవెంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఒకే రోజు జరగడం ఇక్కడ ప్రత్యేకత. కల్యాణోత్సవాలకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఆహ్వానించామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోపలాయపల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 20: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి.ప్రతీ ఏటా చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల ముగింపు దశలో ఈ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం కావడం ఆనవాయితీ. పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం 10 రోజుల పాటు భక్తులను ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదిశేష పడగ నీడన స్వయంభుగా వెలిసిన స్వామి వారి ప్రధానాలయంతో పాటు కొండపై గలఇతర ఉపాలయాలు,ఆంజనేయ స్వామి, మూలస్వామి గుట్ట,రామలింగేశ్వర స్వామి ఆలయాలను తీరొక్క పుష్పాలు, విద్యుత్ కాంతుల దీపాలతో అలంకరించారు.



కొండపై ఆదిశేషుని పడగ నీడలో స్వయంభువుగా



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్సవ విశేషాలు: ఉత్సవాలకు విష్ణుసహస్ర నామ పారాయణంతో శ్రీకారం చుట్టారు. 21న ద్రావిడ ప్ర బంధ పారాయణం, 22న పరమపదోత్సవం, 23న ధ్వజారోహణం, గరుడముద్ద, చాత్మర అంకురార్పణ, దేవతాహ్వానం, 24న స్వామివారి తిరుకల్యాణోత్సవం, హోమం, బలిహరణ, 25న గరుడ సేవ, 26న హనుమంతసేవ, 27న గోపలాయపల్లి పురవీధుల్లో గ్రామోత్సవం, గుట్టపై రథోత్సవం, 28న చక్ర తీర్థం, దోపోత్సవం, 29న శతకలశాభిషేకం, ధ్వజపట ఉద్వాసన, ఏకాంత, పవళింపు సేవలతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. కాగా ఈ ఉత్సవాల్లో స్వామివారి తిరుకల్యాణోత్సవం, రథోత్సవం, దోపోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. హైదరాబాద్ నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అసౌర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీటితో పాటు ఇతర మౌలిక వసతులను కల్పిస్తున్నాం. దాతల సహకారం తో అన్నదానం చేస్తున్నాం. దేవస్థాన అభివృద్ధికి భక్తులు ఇతోధికంగా ఆర్థిక, హార్థిక సాయమందించాలి. కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించి తరించాలి.

- కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, అనువంశిక ధర్మకర్త,

రోడ్డు ప్రమాదంలో గరిడేపల్లి ఎస్‌ఐకి గాయాలు

- పెన్‌పహాడ్ మండలంలో అదుపు తప్పిన కారు
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలింపు
- సూర్యాపేట జిల్లాలో ఘటన

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో కారు అదుపు తప్పి గరిడేపల్లి ఎస్‌ఐకి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి గడ్డిపల్లిలోని అరవింద మాత జ్ఞానమందిర 52వ వార్షిక ఉత్సవాల సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే కబడ్డీ పోటీలను ప్రారంభించేందుకు రాగా గరిడేపల్లి ఎస్‌ఐ ఈటె సైదులు అక్కడికి వెళ్లారు. ప్రారంభోత్సవం అనంతరం గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. విధులు ముగించుకుని మంగళవారం తెల్లవారుజామున తన ఇంటికి కారులో సూర్యాపేటకు బయలుదేరారు. పెన్‌పహాడ్ మండలం సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో స్పృహ కోల్పోయిన ఎస్‌ఐ సైదులును స్థానికులు చూసి 108కు సమాచారమిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం సైదులను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ఎస్‌ఐ ఎడమ చేయి విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఎలాంటి ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని పెన్‌పహాడ్ ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. ఉదయం సమయంలో మంచు కురుస్తుండటంతో మూలమలుపులో ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పిందని ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, గాయపడిన ఎస్‌ఐ సైదులు

ఏసీబీ చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

- రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు
- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ డీఈ కార్యాలయంలో ఘటన





పట్టుబడిన రంగరాజు

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20: విద్యుత్ వీధిలైట్లు ఏర్పాటుచేసిన కాంట్రాక్టర్ నుంచి రూ.5వేలు లంచం తీసుకుంటూ పంచాయతీరాజ్ ఏఈ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కాడు. మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పంచాయతీరాజ్ డీఈ కార్యాలయంలో ఈ సంఘటన జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ ఎన్‌వీ శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేళ్లచెర్వు మండలం శివబాలాజీతండా, దుబ్బతండా పరిధిలో రూ.1.98లక్షలతో తాజా మాజీ సర్పంచ్ కుమారుడు, కాంట్రాక్టర్ కృష్ణ విద్యుత్ వీధిలైట్లను ఏర్పాటుచేశారు. వీటిని ఎంబుక్‌లో నమోదు చేసేందుకు పంచాయతీరాజ్ ఏఈ రంగరాజును కోరగా, ఆయన రూ.5వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మంగళవారం సాయంత్రం హుజూర్‌నగర్ పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయానికి వెళ్లి ఏఈ రంగరాజుకు రూ.5వేలు నగదు అందజేశాడు. అక్కడే ఉన్న ఏసీబీ డీఎస్పీ ఎన్‌వీ శ్రీనివాసరావు రంగరాజును అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో ఏఈ రంగరాజు బోరున విలపించాడు. ఏఈని విచారణ చేసిన అనంతరం ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు అవినీతికి పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ కోరారు. అవినీతి అధికారులు ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు.

రసవత్తరంగా ఆలిండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు

గరిడేపల్లి, ఫిబ్రవరి 20: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంగడ్డిపల్లి గ్రామంలో ఆలిండియా మహిళా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు రసవత్త రంగా కొనసాగుతున్నాయి. అరవింద ధ్యాన మందిర 52వ ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి ప్రారంభమైన కబడ్డీ పోటీలు బుధవారంతో ముగియనుండగా, 13 జట్లు పాల్గొంటున్నా యి. మంగళవారం రాత్రి సౌత్ సెంట్రల్ రైల్వేస్ 37 పాయింట్ల తేడాతో కన్యాకుమారి జట్టుపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ 32 పాయింట్లతో మధురైపై విజయం సాధించింది. తెలంగాణ 29 పాయింట్లు సాధించగా హర్యానా 49 పాయింట్లు సాధించి 20 పాయింట్ల తేడాతో తెలంగాణపై పైచేయి సాధించింది. పూణెపై, బెంగళూర్ 10 పాయింట్ల తేడాతో విజయం సాధించగా, పశ్చిమబెంగాల్ 27 పాయింట్ల తేడాతో ఢిల్లీపై జయకేతనం ఎగురవేసింది.



తలపడుతున్న ఆంధ్రప్రదేశ్, మధురై జట్లు

నేటి నుంచి సమ్మక్క-సారక్క జాతర

● 21 నుంచి 24 వరకు గాజులమల్కాపురం గ్రామంలో ఉత్సవాలు

● ఏర్పాట్లను పూర్తి చేసిన దేవాలయ పాలక కమిటీ నిర్వాహకులు



అలంకరణలో చౌటపల్లి వేణుగోపాలస్వామి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 20: మండలంలోని గాజుల మల్కాపురం గ్రామ శివారులో కొండల మధ్య కొలువదీరిన సమ్మక్క-సారక్క జాతర ఈ నెల 21 నుంచి 24వరకు వైభవంగా నిర్వహించడానికి దేవాలయ పాలక కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ములుగు జిల్లాలోని మేడారంలో సమ్మక్క -సారక్క జాతర ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుగుతుండగా, అదే రోజుల్లో గాజుల మల్కాపురంలో చిన్న సమ్మక్క-సారక్క జాతర అత్యంత వైభవంగా జరగనుంది. ఈ జాతరకు మండలంలోని అన్ని తండాల గిరిజనులతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై వనదేవతలకు మొక్కులు బంగారం(బెల్లం) రూపంలో చెల్లిస్తారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కమిటీ ఛైర్మన్ నాతాల వెంకట్‌రెడ్డి తెలిపారు.

జాతర ప్రారంభం మొదటి రోజున మండలంలోని అన్ని గ్రామాల నుంచి మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని నేవైద్యాలను అమ్మవారికి సమర్పిస్తారు. జాతర సందర్భంగా దేవాలయ ప్రాంగణ సమీపంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని, తెలిపారు. మహిళలకు రాష్ట్ర స్థాయి కోలాట పోటీలు నిర్వహిస్తున్నట్లు పాలక కమిటీ సభ్యులు తెలిపారు.



హుజూర్‌నగర్‌లో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఉన్న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ ఉత్సవాలను ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ నెల 21న నిత్య పూజలతో ప్రారంభం కానున్న ఈ వేడుకలను 22న నిత్యహోమం, 23న ప్రత్యేక పూజలు, 24న స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 25న ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని గ్రామ వీధులలో ఊరేగించిన అనంతరం మహా అన్నదానం నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

శ్రీసీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హుజూర్‌నగర్: పట్టణంలోని రామాలయంలో మంగళవారం శ్రీసీతారామ చంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. అధ్యయనోత్సవాల్లో భాగంగా సేవలు నిర్వహించారు. దేవాలయంలో స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, తులసిమాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఈవో గుజ్జుల కొండారెడ్డి, నర్సింహాచార్యులు, భాస్కరాచార్యులు, భారతమ్మ, పద్మ, ఆండాలు, సుకన్య, మురళీకృష్ణమాచార్యులు, శ్రీనివాసు, దామోదరాచార్యులు, జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా నృసింహుని కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



గాజులమల్కాపురం గ్రామంలో సమ్మక్క-సారక్క దేవాలయం

కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్రికుటేశ్వరాలయం కమిటీ ఛైర్మన్‌గా సుధీర్‌రెడ్డి

పెన్‌పహాడ్: మండలంలోని నాగులపహాడ్ త్రికుటేశ్వరాలయం నూతన కమిటీని మంగళవారం దేవాలయ ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా సంకరమద్ది సుధీర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా దామోదర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, రేఖ, ఇంద్రయ్య, శ్రవణ్‌రెడ్డి, సలహాదారులుగా కొండ జానకిరాములుగౌడ్, నారాయణ రెడ్డి కృష్ణారెడ్డి, రాయలి శ్రీను, ఉపాధ్యక్షులుగా ఒగ్గు దేవయ్య, పుల్లారెడ్డి, పోగుల జానయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి నరేష్, మీసాల నాగయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్‌గా సైదులు

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఉన్న రుక్మిణిసత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సింగారపు సైదులును ఎన్నుకున్నట్లు ఇన్‌చార్జి ఈవో ఎంపీ లక్ష్మణరావు తెలిపారు. సభ్యులుగా కంచాల వీరారెడ్డి, యూ.సైదులు, తుపాకుల మల్లీశ్వరి, శివయ్య, రామకృష్ణాచార్యులును ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు



కృష్ణయ్యకు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కనగాల వెంకటరామయ్య

కోమటి కృష్ణయ్య మృతి బీజేపీకి తీరనిలోటు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్త, బీజేపీ నాయకుడు కోమటి కృష్ణయ్య మృతి బీజేపీకి తీరని లోటని ఆ పార్టీ సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కనగాల వెంకటరామయ్య అన్నారు. కోదాడ మండలంలోని తమ్మరబండపాలెంలో కోమటి కృష్ణయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్రపటానికి వెంకటరామయ్య నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నూనె సులోచన, వంగవీటి శ్రీనివాసరావు, రాధాకృష్ణ, డీసీసీబీ మాజీ ఛైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రంగాచార్యులు, రాములు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

తిరుమలగిరి, ఫిబ్రవరి 20: మేడారం సమ్మక్క- సారక్క జాతర సందర్భంగా కార్మికుల కోరిక మేరకు తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ నుంచి మార్కెట్ ప్రారంభమవుతుందన్నారు.

తిరుమలగిరి తహసీల్దార్‌గా సుధ

తిరుమలగిరి, ఫిబ్రవరి 20: తిరుమలగిరి తహసీల్దార్‌గా ఎల్.సుధ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు తిరుమలగిరి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రమణారెడ్డి తుంగతుర్తికి బదిలీ అయ్యారు. మేడ్చల్ జిల్లా ఆల్వాల్ మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుధ బదిలీపై తిరుమలగిరికి బదిలీ వచ్చారు.

రిటైర్డు అధ్యాపకుడు కృష్ణయ్య మృతి

నేరేడుచర్ల, ఫిబ్రవరి 20: సీనియర్ పాత్రికేయుడు, మిర్యాలగూడ కేఎన్ఎం డీగ్రీ కళాశాల రిటైర్డు అధ్యాపకుడు పానుగంటి కృష్ణయ్య అనారోగ్యంతో మంగళవారం నేరేడుచర్లలోని ఆయన ఇంట్లో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కృష్ణయ్య అంత్యక్రియలు ఆయన స్వగ్రామం మండలం పెంచికల్‌దిన్న గ్రామంలో బుధవారం నిర్వహించనున్నట్లు కుమారుడు మనోజ్ తెలిపారు. కృష్ణయ్య మృతదేహానికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకుడు టీఎన్‌స్వామి, దాడుల నివారణ కమిటీ రాష్ట్ర సభ్యుడు దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చామకూరి వీరయ్య, బుడిగె శంకర్, యారవ సురేష్, దేవులపల్లి శంకరచారి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని కూచిపూడి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జడ్పీటీసీ కృష్ణకుమారి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిలు 'ఉపాధి' నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి: ఎంపీపీ

అనంతగిరి, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రూ. 20లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ, రూ.10లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో మండల కేంద్రానికి రూ.70లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు డేగ కొండయ్య, కొండపల్లి వాసు, బుర్ర పుల్లారెడ్డి, రామునాయక్, ఈదుల కృష్ణయ్య,పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలు రేపు

తుంగతుర్తి, సూర్యాపేట అర్బన్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో ఈనెల 22న నిర్వహించే ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేర్పుల లక్ష్మయ్య, జిల్లా నాయకుడు ఎస్‌కే వాజిద్ కోరారు. మహాసభల కరపత్రాలను మంగళవారం తుంగుతుర్తిలో లక్ష్మయ్య, జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో వాజిద్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్య పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కాసర్ల దుర్గయ్య, నాగెల్లి ఉపేందర్, వల్లపు వీరయ్య, మధు, సుభాని, రమేష్, పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలను కాపాడాలి: మంత్రి

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 20: మండలంలో నీరు లేక ఎండుతున్న పంట పొలాలను కాపాడాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రేపూరు గ్రామమాజీ సర్పంచ్ గంగయ్య, వెంకట్రావ్, తదితరులు తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు.

జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

తుంగతుర్తి, ఫిబ్రవరి 20: సమాజంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ దీపిక యుగేందర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు వీరాత్‌హ, కుంజేటి సత్యనారాయణ, చలసాని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వర్‌రావు, బంటు క్రిష్ణ, శంకర్, రవీందర్‌శర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేందర్‌రావు

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యవకుల అరెస్టు

కోదాడ, ఫిబ్రవరి 20: కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు, విష్ణురామ థియేటర్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి నిందితుల నుంచి 620గ్రాముల గంజాయి, ఒక కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి విక్రయిస్తున్న కోదాడ పట్టణానికి చెందిన దిగుంట్ల ఉపేందర్, చిన్నపంగు అభిలాష్, షేక్ మతిన్, బినవీన్‌రెడ్డి, బెల్లంకొండ వినయ్, నవీన్‌ను పోలీసులు పట్టుకుని వారి నుంచి 620 గ్రాములు గంజాయి, ఒక కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ ఎం.శంకర్, ఎస్‌ఐలు రామకృష్ణ, యాదయ్య, గోవర్ధన్, సిబ్బంది నాగయ్య, ఉదయ్, రాము, నరేష్‌లు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు, జరిమానా

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20: హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు, జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన మురిడి రామిరెడ్డి, గోపిరెడ్డి నాగకృష్ణారెడ్డి కుటుంబాల మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2017 ఏప్రిల్ 28వ తేదీ రాత్రి 10 గంటలకు రామిరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి తన దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళుతుండగా గోపిరెడ్డి నాగకృష్ణారెడ్డి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వారి బంధువు పిల్లి వెంకటరెడ్డితో కలిసి మారణాయుధాలతో సుబ్బారెడ్డిపై హత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో గాయపడిన సుబ్బారెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ దాడిపై సుబ్బారెడ్డి సోదరుడు రామిరెడ్డి చింతలపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఏఎస్ఐ నర్సిరెడ్డి నిందితులపై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ పరమేష్ దర్యాప్తు చేసి నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్తి విచారణ అనంతరం నిందితులపై నేరం నిరూపణ కావడంతో నిందితులు ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ వాదించారు.

ఫ్యాక్టరీ ఉద్యోగులపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 20: పాలకవీడు మండలంలోని ఓ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన ఇద్దరు ఉద్యోగులతో పాటు మరో తొమ్మిది మందిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశించినట్లు బాధితుల తరపున న్యాయవాది కాలువ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలంలోని రావిపాడుకు చెందిన కల్లేటి వెంకయ్యకు జీవనోపాధి నిమిత్తం అప్పటి ప్రభుత్వం 1975లో రావిపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.31/7, 31/18లో ఐదెకరాల భూమిని కేటాయించింది. అప్పటి నుంచి వెంకయ్య, ఆయన కుటుంబ సభ్యులు వ్యవసాయ భూమిని పోడు కొట్టుకుని జీవిస్తున్నారు. కాగా సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫ్యాక్టరీని విస్తరించేందుకు వారికి అనుకూలంగా ఉన్న భూమిని ఆక్రమించుకోవడానికి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారని, ఆ భూమిని వేరే వ్యక్తి చేత దరఖాస్తు చేయించి సిమెంట్ ఫ్యాక్టరీకి కేటాయిస్తున్నట్లుగా రికార్డులు తయారు చేయించారని ఆరోపించారు. వెంకయ్య వారసులు తమ ఆధీనంలోనే భూమి ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయలేదన్నారు. దీంతో హుజూర్‌నగర్ కోర్టును ఆశ్రయించగా, కోర్టు ద్వారా సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన ఇద్దరు ఉద్యోగులతో పాటు మరో తొమ్మిది మందిపై కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు న్యాయవాది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

నాగారం, ఫిబ్రవరి 20: మండలంలోని ఫణిగిరి స్టేజి సమీపంలో సూర్యాపేట -జనగాం జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిర్రబోయిన నరేష్(27) తీవ్రంగా గాయపడి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు..

బీసీ కులగణన చేయడం హర్షనీయం

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 20: బీసీ కులగణన చేయడం హర్షనీయమని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌రావు, లీలావతి అన్నారు. బీసీ కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భంగా హుజూర్‌నగర్‌లో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మ

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 20: వేసవికాలం సమీపిస్తున్నందున గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కొట్టె పద్మసైదేశ్వరరావు కోరారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. సాగర్ నీరు రానందున ఇప్పటికే పలు చెరువులు, బావులు ఎండిపోయాయన్నారు. మిషన్ భగీరథ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నీటి కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. చెరువులు నింపడానికి సాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు, మూడు నెలల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మండల వైద్యాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ గాయం గోపిరెడ్డి, ఎంపీడీవో ఖాజా అస్గర్ అలీ, ఎంపీటీసీలు, బండారుపల్లి రామకృష్ణ, బొమ్మకంటి కొండలు, అన్నపంగు శంభయ్య, కొండల్‌రావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు రైతులకు ఉపయోగపడాలి

ఆత్మకూర్(ఎస్), ఫిబ్రవరి 20: 'ఉపాధి' పథకంలో రైతులకు ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ మధుసూదన్ రాజు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్వహించిన పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలని అన్నారు. సోషల్ ఆడిట్‌లో ప్రధానంగా మస్టర్ పేమెంట్ల పొరబాట్లు, ప్లాంటేషన్ కొలతల్లో తేడాలు గుర్తించగా రూ.1,43,870లను గ్రామాల కార్యదర్శులు, 'ఉపాధి' ఫీల్డ్ అసిసెంట్ల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డి.లచ్చీరాం నాయక్, విజిలెన్స్ అధికారి ఆశారాణి, ఎంపీడీవో మహ్మద్ హసీం, ఎస్ఆర్పీ రమేష్, ఏపీవో ఈశ్వర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ మధుసూదన్‌రాజు

జిల్లా సదస్సును విజయవంతం చేయాలి: ఎమ్మార్పీఎస్



సదస్సు కరపత్రాలను కోదాడలో ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ రూరల్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలో ఈ నెల 27న జరిగే మాదిగ, మాదిగ ఉపకులాల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నారకట్ల ప్రసాద్ కోరారు. మంగళవారం మండలంలోని దోరకుంట గ్రామంలో జిల్లా సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించే వరకు జరిగే మాదిగలు పోరాటం చేయాలన్నారు. జిల్లా సదస్సుకు మాదిగ, మాదిగ ఉపకులాల విద్యావంతులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు, యువకులు, మేధావులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో స్వామి, మరియదాసు, అనిల్, బ్రహ్మం, మహేష్ పాల్గొన్నారు.

మఠంపల్లి: సూర్యాపేటలో ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రెడపంగు నాగరాజు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సంఘం నాయకులతో కలిసి జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రావూరి విజయ్‌భాస్కర్, రెడపంగు కాశయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు చిలక లోకేష్, రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థినుల మృతిపై న్యాయ విచారణ చేయించాలి

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 20: ఎస్సీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేయించాలని సూర్యాపేట పూర్వ మిత్ర మండలి కమిటీ సభ్యుడు నల్లకుంట్ల అయోధ్య అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థినులు వైష్ణవి, అస్మిత చిత్రపటాలకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో నివాళులర్పించి మాట్లాడారు. ఒక్కో విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి సమస్యలను ఎదుర్కొనేలా శిక్షణ ఇవ్వాలన్నారు. గురుకులాల్లో ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు మల్లికార్జున్, వై.నర్సయ్య, నల్లపాటి అప్పారావు, షేక్‌సైదులు, తన్నీరు యాదగిరి, గుడిపాటి శేషయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.



సూర్యాపేటలో నివాళులర్పిస్తున్న పూర్వమిత్ర మండలి కమిటీ సభ్యులు



కోదాడ: కోదాడ పట్టణ అభివృద్ధి పనులపై భారీ నీటి పారుదల మంత్రి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి మంగళవారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న మంజూరైన నిధులతో చేయాల్సి పనుల శంకుస్థాపనకు తగిన ఏర్పాట్లు చేయవల్సిందిగా అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, కమిషనర్ రమాదేవి, పబ్లిక్ హెల్త్ డీఈఈ రమాదేవిల పాల్గొన్నారు.

మునగాల రూరల్: ఇంటర్మీడియల్, పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఆర్డీవో సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ రెండో తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షల దృష్ట్యా తహసీల్దార్ తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సూర్యాపేటఅర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీఐఈవో జానపాటి కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శ్రీలక్ష్మీవెంకటసాయి ఒకేషనల్ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కారింగుల విజయలక్ష్మి, బాలాగౌడ్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): పదో తరగతి, ఇంటర్ పరీక్షలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో పి.ధారాసింగ్ కోరారు. పరీక్షల నిర్వహణపై ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

సూర్యాపేట రూరల్: వ్యవసాయ విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ విధి విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలని కేవీకే శాస్త్రవేత ఆకుల నరేష్ అన్నారు. సికింద్రాబాద్ లయోలా అకాడమి విద్యార్థులకు కాసరబాద గ్రామంలో గ్రామీణ రైతుల స్థితిగతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చివ్వెంల: అయోధ్య బాలరాముడి దర్శనానికి మండల కేంద్రం నుంచి భక్తులు తరలివెళ్లారు. చివ్వెంల నుంచి మంగ్రనాయక్, జానునాయక్, శంకర్, వినోద్‌కుమార్, అశోక్ నాయక్, వెంకట్ తదితరులు వెళ్లారు.

గరిడేపల్లి: సాగర్ ఎడమ కాల్వకు ప్రభుత్వం నీటిని విడుదల చేసి ఎండుతున్న పైర్లను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సుభాష్‌నగర్, అబ్బి రెడ్డిగూడెం, లక్ష్మీపురం, కల్మలచెర్వు గ్రామాల్లో ఎండు దశకు చేరిన వరి పైర్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతులు పిచ్చిరెడ్డి ,కృష్ణారెడ్డి, సైదిరెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: బీహార్‌కు చెందిన బలహీన వర్గాల ఆశాజ్యోతి, మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు సుతారి శ్రీనివాస్, సీతారాంపురం మాజీ సర్పంచ్ అద్దంకి సైదేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఇందిర సెంటరులో కర్పూరి ఠాకూర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవి, పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండలంలోని తెలగరామయ్యగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

మఠంపల్లి: మండలంలోని యాతవాకిళ్ల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల పాత్రలను విద్యార్థులు పోషించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బానోతు వెంకట్రాంనాయక్, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, మస్తాన్,పాల్గొన్నారు.

కోదాడ టౌన్: అయోధ్య రాముని ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని బీజేపీ నాయకురాలు నూనె సులోచన అన్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి అయోధ్యకు బయలుదేరిన యాత్రికుల బస్సును కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అక్కిరాజు యశ్వంత్, కనగాల నారాయణ, బొలిశెట్టి కృష్ణయ్య, సాతులూరి హనుమంతరావు, వంగవీటి శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాతలు తెడ్ల, జయశంకర్, స్వాతి, పెనుగొండ, వెంకటేశ్వర్లు, కస్తూరి బోడ్ల, ఫణీంద్ర, సౌందర్య, నీలేష్, రాంబాబుల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

చిలుకూరు: మండలంలోని కొమ్ముబండతండాలో ఈ నెల 27న బొడ్రాయి ప్రతిష్ఠోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మంగళవారం పుట్ట మన్ను సేకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతగిరి: మండలంలోని త్రిపురవరం గ్రామానికి చెందిన గరిడేపల్లి పద్మ ఈ నెల 14న మృతి చెందగా, ఆమె కుటుంబానికి గణపతి యూత్ సభ్యులు రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు.

తిరుమలగిరి: ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ మల్లెల వందన కోరారు. మార్చి 3వ తేదీన నుంచి ప్రారంభమయ్యే పల్స్ పోలియో కార్యక్రమంపై తిరుమలగిరి పీహెచ్‌సీలో ఆరోగ్య, విద్య, మునిసిపల్, పోలీస్, మండల పరిషత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.